క్లుప్తంగా

రాజన్న ఆలయ వార్షికోత్సవం

పెగడపల్లి: మండల కేంద్రంలోని శ్రీస్వయంభూ రాజరాజేశ్వరస్వామి ఆలయ వార్షిక వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. 25 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా ప్రత్యేక పూజలు, అభిషేకాలు తదితర పూజలు ఆలయ అర్చకులు శ్రీనివాస్‌శర్మ, వినయ్‌శర్మ ఆధ్వర్యంలో నిర్వహించారు. భక్తులు పాల్గొని పూజలు చేశారు. ఆలయ కమిటీ చైర్మన్ పొరుగల శ్రీనివాస్, మాజీ చైర్మన్ కరుణాకర్‌రావు, మాజీ సర్పంచ్ శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి రామచంద్రం తదితరులు పాల్గొన్నారు.

ముక్కోటికి ఏర్పాట్లు

జగిత్యాలటౌన్: వైకుంఠ ఏకాదశి సందర్భంగా జిల్లాలోని ఆలయాలను అందంగా అలంకరించారు. జిల్లాకేంద్రంలోని వేణుగోపాలస్వామి ఆలయం, బైపాస్‌రోడ్డులోని అష్టలక్ష్మీసహిత లక్ష్మీనారాయణ ఆలయం, మార్కండేయ ఆలయం, ధరూర్ క్యాంపు కోదండరామాలయం, అంబారిపేటలోని వేంకటేశ్వరస్వామి ఆలయాలను ముస్తాబు చేశారు.

సారంగాపూర్: శుక్రవారం ముక్కోటి ఏకాదశి సందర్భంగా బీర్‌పూర్ శ్రీలక్ష్మీనృసింహస్వామి ఆలయంలో ఉత్తర ద్వారం గుండా స్వామివారిని దర్శించుకోవడానికి అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

తొక్కిసలాట మృతులకు నివాళి

జగిత్యాలటౌన్: తిరుపతి వైకుంఠ ద్వార దర్శన టోకెన్ల తొక్కిసలాటలో మృతిచెందిన భక్తులకు భారత్ సురక్షా సమితి నాయకులు గురువారం తహసీల్ చౌరస్తాలో నివాళి అర్పించారు. రాష్ట్ర కార్యదర్శి ఏసీఎస్ రాజు మాట్లాడుతూ.. ఇలాంటివి చోటుచేసుకోకుండా చూడాలని కోరారు. నాయకులు అక్కినపెల్లి కాశీనాథం, సింగం గంగాధర్, నరేందుల శ్రీనివాస్, బండారి మల్లికార్జున్, అంజన్న తదితతరులు పాల్గొన్నారు.

మార్గదర్శకాలు వెనక్కి తీసుకోవాలి

జగిత్యాల: యూజీసీ మార్గదర్శకాలు వెనక్కి తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రజినికాంత్ అన్నారు. గురువారం ప్రభుత్వ జూనియర్ కళాశాల ఎదుట ఆందోళన చేపట్టారు. రాహుల్, వరుణ్, కార్తీక్, రిషిధర్, చందు, శ్రీకాంత్, నిమిత్ పాల్గొన్నారు.

ముగ్గుల పోటీలు

గొల్లపల్లి: నేషనల్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ ఎన్జీవో సంస్థ మండల శాఖ ఆధ్వర్యంలో మకర సంక్రాంతి సందర్భంగా మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాల బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో విద్యార్థినులు, మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందజేశారు. ఐల్నేని శ్రీనివాసరావు, నక్క గంగారాం తదితరులు పాల్గొన్నారు.

రాయికల్: మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. అంగన్‌వాడీ కార్యకర్తలు, ఐకేపీ సిబ్బంది, మహిళా కార్యదర్శులు, కారోబార్లు పాల్గొన్నారు. తహసీల్దార్ ఖయ్యూం, ఎంపీవో సుష్మ, డిప్యూటీ తహసీల్దార్ గణేశ్ తదితరులున్నారు.

ఆర్థిక సాయం

మల్యాల: ముత్యంపేట గ్రామానికి చెందిన నిరుపేద బొమ్మకంటి రాజుగౌడ్ వైద్య ఖర్చుల కోసం మన నేస్తం హెల్పింగ్ హాండ్స్ ఫౌండేషన్ సభ్యులు రూ.10వేలు అందజేశారు.

మెట్‌పల్లి: పట్టణానికి చెందిన మున్సిపల్ కార్మికుడు మారంపల్లి రాజం మృతిచెందగా.. ఆయన కుటుంబాన్ని గురువారం చైర్‌పర్సన్ రాణవేని సుజాత పరామర్శించారు. రూ.10వేలు అందజేశారు.

మల్లాపూర్: మండల కేంద్రంలో బాధిత కుటుంబాలకు మోడల్ స్కూల్ సహచర విద్యార్థులు అండగా నిలిచారు. గురువారం మల్లాపూర్‌లోని బాధిత కుటుంబాలను మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ భూమేశ్ ఆధ్వర్యంలో అధ్యాపకులు పరామర్శించారు. విద్యార్థులు సేకరించిన విరాళాలు రూ.12వేల చొప్పున మొత్తం రూ.24వేల ఆర్థిక సాయాన్ని అందించారు. గ్రామానికి చెందిన మానాల అశోక్, రామనర్సయ్య పిల్లలు మోడల్ స్కూల్‌లోనే విద్యనభ్యసిస్తున్నారన్నారు. అశోక్ ఉపాధి కోసం దుబాయి వెళ్లగా.. అక్కడ జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడి మృతిచెందడం బాధకరమని అన్నారు. నర్సయ్య ఇటీవల మల్లాపూర్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడన్నారు. మా పాఠశాల విద్యార్థుల కుటుంబానికి అండగా నిలిచేందుకు వారి సహచర విద్యార్థులు రూ.24వేల ఆర్థిక సాయాన్ని అందజేసినట్లు తెలిపారు. గానకోకిల అకాడమీ ఆధ్వర్యంలో నృత్య ప్రదర్శనలో శ్రీహర్షిణి, హన్సిక ప్రథమ, ద్వితీయ బహుమతులు పొందడం అభినందనీయమని ప్రిన్సిపాల్ భూమేశ్ అన్నారు.

ముదిరాజ్ సంఘానికి రూ.3.50లక్షలు

మెట్‌పల్లి: పట్టణంలోని పెద్దమ్మ ఆలయ ఆవరణలో ఉన్న ముదిరాజ్ సంఘంలో అభివృద్ధి పనులకు ఎంపీ ధర్మపురి అరవింద్ రూ.3.50లక్షలు మంజూరు చేశారు. గురువారం ఇందుకు సంబంధించిన ప్రొసీడింగ్ కాపీని బీజేపీ నాయకులు సంఘ పెద్దలకు అందజేశారు.

కనీస వేతనం అమలు చేయాలి

కథలాపూర్: సర్వశిక్షాభియాన్ ఉద్యోగులకు మినిమం టైం స్కేల్ కల్పించేలా కృషి చేస్తామని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పోటీదారు ఎల్.సుహాసిని అన్నారు. గురువారం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, జెడ్పీ హైస్కూల్ ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు.



గోదాదేవి కల్యాణం

మెట్‌పల్లిరూరల్: జగ్గాసాగర్ రామాలయంలో గోదారంగనాథుల కల్యాణోత్సవాన్ని గురువారం కన్నుల పండువగా నిర్వహించారు. అర్చకుడు చక్రపాణి మాధవాచార్యుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, వివిధ కార్యక్రమాలు కొనసాగాయి. ఇల్లెందుల కృష్ణమాచారి పుస్తెమెట్టెలను అందజేశారు. వీడీసీ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



భక్తుల పాదయాత్ర

జగిత్యాలరూరల్: పొలాస గ్రామ శివారులోని సహస్ర లింగాల దేవాలయానికి గురువారం నిజామాబాద్ నుంచి భక్తులు పాదయాత్రగా వచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేద పండితులు భక్తులను ఘనంగా సన్మానించారు. ఆలయ చైర్మన్ నలమాసు గంగాధర్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



శబరిమలకు స్వాములు

గొల్లపల్లి: అయ్యప్ప స్వాములు ఇరుముడి కట్టుకొని గురువారం శబరిమల యాత్రకు బయలుదేరారు. ముక్తామని చిల్వాకోదూరు శ్రీరామలింగేశ్వరస్వామి ఆలయంలో గురుస్వాములు బొమ్మెన కుమార్ నరేందర్, గంధ వేణు, గంధం పరంధాములు, అల్లాడి వెంకన్న ఆధ్వర్యంలో ఇరుముడి కట్టుకున్నారు.

మల్యాల: మండల కేంద్రం నుంచి అయ్యప్ప స్వాములు గురువారం శబరిమలకు తరలివెళ్లారు. అయ్యప్పస్వామి క్షేత్రంలో 16 మంది ఇరుముడులు కట్టుకొని వెళ్లారు.

ఇందిరమ్మకాలనీలో అన్నీ కష్టాలే..

- ఎర్రకుంట నీటితో రోగాలు
- మురుగు కాలువల్లేక అవస్థలు
- తాగునీరు కొనుక్కునే పరిస్థితి

రాయికల్: బల్దియాలోని 3వ వార్డు ఇందిరమ్మకాలనీవాసులు మురుగు కాలువల్లేక, తాగునీటి సౌకర్యం లేక ఎర్రకుంట నీటితో వ్యాధుల బారిన పడుతున్నారు. ఇందిరమ్మకాలనీలో 250 నివాస గృహాలుండగా.. సుమారు 600 మంది నివసిస్తున్నారు. ఈ కాలనీలో ముగుగు కాలువలు లేక కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వారం రోజుల క్రితం మురుగు కాలువ నిర్మాణం కోసం సంబంధిత కాంట్రాక్టర్ పనులు చేపట్టి మధ్యలోనే వదిలివెళ్లగా.. కాలనీవాసులు తవ్విన కాలువ లోంచి వెళ్లాలంటే నరకయాతన అనుభవిస్తున్నారు. తాగునీటి సౌకర్యం లేక కొనుక్కునే పరిస్థితి నెలకొందని మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పారిశుధ్యం సైతం అస్తవ్యస్తంగా ఉండటంతోపాటు సిబ్బంది చెత్త సేకరణ కోసం 10 రోజులకోసారి రావడంతో ఇబ్బందులు పడుతున్నామని, చెత్తను కాలనీలో ఆరుబయట పడేయాల్సిన పరిస్థితి నెలకొందని పేర్కొంటున్నారు.



ఇందిరమ్మకాలనీలోని ఎర్రకుంటలో నిల్వ ఉన్న నీరు

మురుగు నీరంతా ఎర్రకుంటలోకి రావడంతో దోమలు స్వైర విహారం చేస్తున్నాయి. డెంగీ, మలేరియా వంటి వ్యాధులు ప్రబలి అనారోగ్యం పాలవుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పలుమార్లు మున్సిపల్ కౌన్సిలర్, అధికారుల దృష్టికి తీసుకెళ్లినా సమస్యలను పరిష్కరించడం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సమస్యలను పరిష్కరించాలని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డిని వేడుకుంటున్నారు.



ఇందిరమ్మకాలనీలో ఆరుబయట చెత్తాచెదారం

కాలువ తవ్వి వారమైతంది



మా ఇంటి ముందు మురుగు కాలువ నిర్మాణం కోసం కాంట్రాక్టర్ వారం రోజుల క్రితం కాలువ తవ్వి వదిలిపెట్టాడు. ఇంట్లోంచి బయటకు రావాలంటేనే ఇబ్బందులు పడుతున్నాం. మా గోస ఎవరూ పట్టించుకోవడం లేదు. – షేక్ జమునబీ

పారిశుధ్యం అస్తవ్యస్తం



మా కాలనీలో పారిశుధ్యం అస్తవ్యస్తంగా ఉంది. ప్రతిరోజు చెత్తను స్వయంగా కాలనీ ఆరుబయట పారబోసే పరిస్థితి నెలకొంది. మున్సిపల్ సిబ్బంది ఇటు వచ్చి చూసిన పాపాన పోలేదు. – శకుంతల

ఎర్రకుంట నీటితో వ్యాధులు



మా కాలనీలోని ఎర్రకుంటలో ఉన్న నీటితో దోమలు స్వైర విహారం చేయడంతో డెంగీ, మలేరియా వంటి వ్యాధులు వస్తున్నాయి. మా ఇంట్లో ప్రతి ఒక్కరూ మంచాన పడ్డారు. ఎర్రకుంటలో నీటిని తొలగించాలి. – భూమక్క

సమస్యలు పరిష్కరిస్తాం



ఇందిరమ్మకాలనీలో నెలకొన్న సమస్యలను పరిష్కరిస్తాం. పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించి మురుగు కాలువ నిర్మాణం చేపట్టడంతోపాటు చెత్త సేకరణకు సిబ్బందిని పంపిస్తాం – జగదీశ్వర్‌గౌడ్, మున్సిపల్ కమిషనర్

పాఠశాల సందర్శన

మేడిపల్లి: భీమారం మండలం గోవిందారం జిల్లాపరిషత్ పాఠశాలను జిల్లా విద్యాధికారి కేలావత్ రాము గురువారం సందర్శించారు. విద్యార్థులతో మాట్లాడారు. వచ్చే రెండు మాసాల్లో పదోతరగతి వార్షిక పరీక్షలు వస్తున్నందున విద్యార్థులు మానసికంగా బాలంగా ఉండాలని సూచించారు. పాఠశాలలో డిజిటల్ క్లాసుల విధానంపై అడిగి తెలుసుకున్నారు. సెక్టోరియల్ ఆఫీసర్ చిప్ప సత్యనారాయణ, ప్రధానోపాధ్యాయులు అశ్వక్ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

గమ్యం చేరేవరకూ శ్రమించాలి

మల్లాపూర్: విద్యార్థులు గమ్యం చేరేవరకు శ్రమించాలని మండల విద్యాధికారి కేతిరి దామోదర్‌రెడ్డి అన్నారు. గురువారం రేగుంట ప్రాథమిక పాఠశాలలో స్టూడెంట్ క్యాలెండర్‌ను ఉపాధ్యాయులతో కలిసి ఆవిష్కరించారు. ప్రధానోపాధ్యాయుడు దుమాల శంకర్, ఉపాధ్యాయులు గురుగుబెల్లి నర్సింగరావు, పబ్బ అనిల్, మద్దెల రాజారత్నం, దార గోవర్దన్, లలిత, రజని తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి ఉపాధ్యాయ సంఘాలు కృషి చేయాలని ఎంఈవో దామోదర్‌రెడ్డి అన్నారు. గురువారం రాఘవపేట స్కూల్ కాంప్లెక్స్ ఆవరణలో టీఎస్ యూటీఎఫ్ నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరించారు. బబ్బూరి రాజేందర్, ఉత్కం నిరంజన్‌గౌడ్, జరుపుల సుధాకర్, సిరిగాని గణేశ్, వేముల శ్రీనివాస్, రాజమల్లేశ్, ఉదయ్‌కుమార్, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

కోరుట్ల రూరల్: పట్టణంలోని ఆల్ ఇండియా అంబేడ్కర్ సంఘం డివిజన్ అధ్యక్షుడు ఉయ్యాల శోభన్ ముద్రించిన 2025 నూతన డైరీని మెట్‌పల్లి డీఎస్పీ అడ్లూరి రాములు గురువారం ఆవిష్కరించారు.

మందులు అందుబాటులో ఉంచుకోవాలి

జగిత్యాల: ఆస్పత్రుల్లో వంద రకాల మందులు అందుబాటులో ఉంచుకోవాలని డీఎంహెచ్‌వో ప్రమోద్‌కుమార్ అన్నారు. కలెక్టరేట్‌లో వైద్యాధికారులు, ఫార్మసిస్టులతో గురువారం సమావేశమయ్యారు. మందుల సరఫరాకు మూడు నెలల ముందుగా సెంట్రల్ మెడికల్ స్టోర్‌కు ఇండెంట్ పెట్టుకోవాలని ఆదేశించారు. ప్రోగ్రాం ఆఫీసర్ శ్రీనివాస్, డాక్టర్ శ్రీనివాస్, సుమన్, రామకృష్ణ, మోహన్‌రావు పాల్గొన్నారు.

నియామకం

బీజేపీ పట్టణ, మండల అధ్యక్షుల నియామకం

కోరుట్ల రూరల్/రాయికల్/జగిత్యాలటౌన్/మల్లాపూర్: జిల్లాలోని 15 మండలాలకు భారతీయ జనతా పార్టీ పట్టణ, మండల అధ్యక్షులను గురువారం నియమించింది. జగిత్యాల టౌన్ అధ్యక్షుడిగా కొక్కు గంగాధర్, జగిత్యాల మండల అధ్యక్షుడిగా ఇట్నేని రమేశ్, జగిత్యాల అర్బన్ గడ్డం రాంరెడ్డి, రాయికల్ మండల అధ్యక్షుడిగా అన్నవేని వేణు, బీర్‌పూర్ మండల అధ్యక్షుడిగా ఆడెపు నర్సయ్య, ఇబ్రహీంపట్నం బాయి లింగారెడ్డి, మెట్‌పల్లి మండల అధ్యక్షుడిగా కొమ్ముల రాజ్‌పాల్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడిగా బొడ్ల రమేశ్, మల్లాపూర్ మండల అధ్యక్షుడిగా గోపిడి శ్రీనివాస్‌రెడ్డి, కోరుట్ల పట్టణ అధ్యక్షుడిగా బింగి వెంకటేశ్, మండల అధ్యక్షుడిగా పంచిరి విజయ్, ధర్మపురి పట్టణ అధ్యక్షుడిగా గాజుల భాస్కర్, ధర్మపురి మండల అధ్యక్షుడిగా కుమ్మరి తిరుపతి, ఎండపల్లి మండల అధ్యక్షుడిగా రావు హన్మంతరావు, పెగడపల్లి మండల అధ్యక్షునిగా పల్లె మోహన్‌రెడ్డిని రాష్ట్ర పార్టీ ఆదేశాల మేరకు నియమించినట్లు జిల్లా ఎన్నికల అధికారి కె.వి.ఎల్.ఎన్.రెడ్డి తెలిపారు.

నియామకం

పెగడపల్లి: తెలంగాణ చేనేత ఐక్య వేదిక జిల్లా యూత్ అధ్యక్షుడిగా ఏడుమోటలపల్లికి చెందిన సాంబారి లక్ష్మీనారాయణ నియామకమయ్యారు.

ఎస్టీయూ కార్యవర్గం

ధర్మపురి: పట్టణంలో గురువారం ఎస్టీయూ కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మచ్చ శంకర్, భైరం హరికిరణ్ ఒక ప్రకటనలో తెలిపారు. మండల అధ్యక్షురాలిగా సాయిదివ్య, ప్రధాన కార్యదర్శిగా పతంగి మహేశ్, అసోసియేటెడ్ అధ్యక్షుడిగా నునావత్ రాజేశ్, ఉపాధ్యక్షులుగా బొమ్మెల్ల ప్రీతి, పత్తి అంజనేయులు, ఆర్థిక కార్యదర్శిగా గంగరాజం, జిల్లా కౌన్సిలర్లుగా శీలం నర్సయ్య, సంగి శంకర్ తదితరులు ఎన్నికయ్యారు.

ముందస్తు సంక్రాంతి సంబరాలు

జగిత్యాల: సంక్రాంతి పండుగ పల్లె శోభను తలపిస్తుందని అల్ఫోర్స్ అధినేత నరేందర్‌రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని అల్ఫోర్స్ పాఠశాలల్లో సంక్రాంతి సంబరాలు గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ పండుగను దేశవిదేశాల్లో సైతం జరుపుకుంటున్నారన్నారు. భోగి మంటలు, డూడూబసవన్న ప్రదర్శనలు అలరించాయి. అధ్యాపక బృందం పాల్గొన్నారు.



సంబరాల్లో పాల్గొన్న నరేందర్‌రెడ్డి

విదేశీ ఉద్యోగాలకు పేర్లు నమోదు

జగిత్యాలటౌన్: తెలంగాణ ఓవర్సీస్ మ్యాన్‌పవర్ కంపెనీ లిమిటెడ్(టాంకాం) ఆధ్వర్యంలో సింగాపూర్‌లో మేషన్, స్టీల్ ఫిక్సర్ ఉద్యోగాలకు ఈనెల 10 శుక్రవారం పేర్ల నమోదు కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పనాధికారి బింగి సత్యమ్మ గురువారం తెలిపారు.

మధ్యాహ్న భోజనంలో నాణ్యత పాటించాలి

ధర్మపురి: ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనంలో నాణ్యత పాటించాలని ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ అన్నారు. ధర్మపురిలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలకు గురువారం వంట పాత్రలు పంపిణీ చేశారు. వేతనాలు, కోడిగుడ్ల ధరలు పెంచాలని, నెలకు సరిపడా సిలిండర్లు అందించాలని భోజన నిర్వాహకులు విప్ దృష్టికి తీసుకెళ్లారు. మున్సిపల్ చైర్‌పర్సన్ సంగి సత్తమ్మ, కౌన్సిలర్ విజయలక్ష్మి, ఎంఈవో సీతామహాలక్ష్మి తదితరులున్నారు.

వెల్గటూర్: ఎన్నికల సమయంలో ప్రజలకిచ్చిన హామీలన్నింటినీ కాంగ్రెస్ ప్రభుత్వం తప్పక నెరవేరుస్తుందని ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ అన్నారు. మండల కేంద్రంలోని వీఎస్ఆర్ గార్డెన్‌లో గురువారం ఏర్పాటు చేసిన కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కాంగ్రెస్ నాయకులు, లబ్ధిదారులు తదితరులున్నారు.



వంట పాత్రలు అందిస్తున్న విప్

గుంతలు పూడ్చివేత



మట్టి పోయించి చదును చేయిస్తున్న అంజయ్య, నాయకులు

కథలాపూర్: తాండ్ర్యాల ఎక్స్ రోడ్డు నుంచి గంభీర్‌పూర్ గ్రామం వరకు రోడ్డుపై ఉన్న గుంతలను గురువారం మట్టితో పూడ్చివేయించారు. పోతారం గ్రామానికి చెందిన పీసీసీ కార్యవర్గ సభ్యుడు తొట్ల అంజయ్య ప్రత్యేక చొరవ చూపి గుంతల్లో మట్టిని పోయించి ట్రాక్టర్‌తో చదును చేయించారు.

ఈ-పాస్ ద్వారానే ఎరువులు విక్రయించాలి

మల్లాపూర్: ఈ-పాస్ యంత్రాల ద్వారానే రైతులకు ఎరువులను విక్రయించాలని కోరుట్ల ఏడీఏ దండ రమేశ్ అన్నారు. గురువారం మండల కేంద్రంతోపాటు మొగిలిపేట గ్రామంలో మండల వ్యవసాయ శాఖ అధికారి లావణ్యతో కలిసి ఫర్టిలైజర్ దుకాణాలను తనిఖీ చేశారు. ఎరువుల నిల్వలు, స్టాక్ రిజిస్టర్, ఈ-పాస్ మిషన్‌ను పరిశీలించారు. వరి నారుమళ్లు, మొక్కజొన్న పంటల సాగును పరిశీలించారు. ఏఈవోలు, రైతులు తదితరులు పాల్గొన్నారు.



మల్లాపూర్‌లో రిజిస్టర్ పరిశీలిస్తున్న ఏడీఏ రమేశ్

రోడ్డు ప్రమాదాలపై అవగాహన తప్పనిసరి

జగిత్యాలక్రైం: రోడ్డు ప్రమాదాల నివారణపై ప్రతి ఒక్కరికి అవగాహన ఎంతో అవసరమని జిల్లా రవాణా శాఖ అధికారి శ్రీనివాస్ అన్నారు. గురువారం జగిత్యాల అర్బన్ మండలం తిప్పన్నపేట గ్రామ శివారులోని సూర్య గ్లోబల్ స్కూల్‌లో జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాల్లో భాగంగా ప్రమాదాల నివారణపై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ట్రాఫిక్ ఎస్సై మల్లేశ్, ఎంవీఐలు అభిలాశ్, రామారావు, రియాజ్, ప్రమీల, పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీధర్‌రావు, డైరెక్టర్లు హరిచరణ్‌రావు, మౌనికరావు, రజితరావు పాల్గొన్నారు.

బుగ్గారం: తాము చదువుకున్న పాఠశాల అభివృద్ధిలో భాగంగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడం ఎంతో అభినందించదగ్గ విషయమని బుగ్గారం ఎస్సై శ్రీధర్‌రెడ్డి అన్నారు. రోడ్డు భద్రతా వారోత్సవాల్లో భాగంగా మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలో స్థానిక పోలీసుల ఆధ్వర్యంలో ట్రాఫిక్ నిబంధనలపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పాఠశాలలో చదువుకున్న 1998–99 ఎస్సెస్సీ మిత్ర బృందం పాఠశాలకు సీసీ కెమెరాలను అందించారు. ప్రధానోపాధ్యాయుడు మోహన్‌రెడ్డి, ఎంపీవో ప్రవీణ్, పూర్వ విద్యార్థులు ఎండీ రహమాన్, శ్రీనివాస్, కొత్తపెల్లి గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న శ్రీనివాస్

స్థల పరిశీలన



ఇబ్రహీంపట్నం: మండలంలోని 7 విద్యుత్ సబ్ స్టేషన్లలో సోలార్ ప్లాంట్ల ఏర్పాటుకు తహసీల్దార్ ప్రసాద్ గురువారం స్థలాలను పరిశీలించారు. ఇబ్రహీంపట్నం, అమ్మక్కపేట, వర్షకొండ, ఎర్దండి, వేములకుర్తి, యామాపూర్, గోదూర్ సబ్ స్టేషన్లలో సోలార్ ప్లాంట్లు ఏర్పాటు చేసి విద్యుత్ సరఫరా చేసేందుకు గాను ఒక్కో సబ్ స్టేషన్‌కు ఐదెకరాల స్థలంలో ప్లాంటు ఏర్పాటుకు రెవెన్యూ అధికారులు స్థలాలను పరిశీలిస్తున్నారు. ఇబ్రహీంపట్నం, అమ్మక్కపేట సబ్ స్టేషన్ల వద్ద సోలార్ ప్లాంట్ల ఏర్పాటుకు స్థలం అనువుగా ఉన్నట్లు గుర్తించారు. మిగతా సబ్ స్టేషన్లకు స్థలాలను ఎంపిక చేస్తున్నట్లు తహసీల్దార్ తెలిపారు. ట్రాన్స్‌కో ఏఈ సతీశ్, ఆర్ఐలు నిరంజన్ రెడ్డి, రమేశ్ పాల్గొన్నారు.

ఇసుక డంపులు సీజ్

మెట్‌పల్లిరూరల్: మెట్‌పల్లి మండలం ఆత్మనగర్‌లో నిల్వ చేసిన ఇసుక డంపులను రెవెన్యూ అధికారులు గురువారం సీజ్ చేశారు. స్థానిక వాగు నుంచి ఇసుకను తీసుకొచ్చి గ్రామంలో పలుచోట్ల నిల్వ చేసినట్లు ఓ ఉన్నతధికారికి ఫిర్యాదులు వెళ్లాయి. ఆయన ఆదేశాలతో మూడు రోజుల క్రితం 10 ట్రిప్పుల ఇసుక, గురువారం మరో 50 ట్రిప్పుల ఇసుకను సీజ్ చేశారు. ఇసుకను మైనింగ్ అధికారులకు అప్పగించనున్నట్లు రెవెన్యూ అధికారులు తెలిపారు.



సీజ్ చేసిన ఇసుక వద్ద ఆర్ఐ, గ్రామస్తులు

ఎస్సైపై ఫిర్యాదు

కొండగట్టు: కొడిమ్యాల ఎస్సై సందీప్‌పై గురువారం మండల కేంద్రానికి చెందిన రాచకొండ రాజేందర్ హ్యూమన్ రైట్స్ కమిషన్‌కు ఫిర్యాదు చేశాడు. శనివారం రాత్రి పోలీసులు డ్రంకెన్‌డ్రైవ్ పరీక్షలు చేస్తుండగా.. వారిని చూడకుండా వెళ్లిపోయిన తనను ఎస్సై, కానిస్టేబుల్ రాకేశ్ వెంబడించి ఇంటి వరకు వచ్చి దుర్భాషలాడుతూ దాడి చేశారని పేర్కొన్నారు.


ఉచిత నేత్ర వైద్యశిబిరం

కథలాపూర్: కథలాపూర్ మోడల్ స్కూల్‌లో త్రినేత్రి ఐ కేర్ ఆసుపత్రి ఆధ్వర్యంలో గురువారం ఉచిత నేత్ర వైద్యశిబిరం నిర్వహించారు. మోడల్ స్కూల్‌లో చదువుతున్న విద్యార్థులకు కంటి పరీక్షలు చేశారు. మందులు పంపిణీ చేశారు. నేత్ర వైద్యుడిని ఉపాధ్యాయులు శాలువాతో సన్మానించారు. నేత్ర వైద్యుడు మైస శ్రీధర్, ప్రిన్సిపాల్ అనిత, ఉపాధ్యాయులు రాజు జాదవ్, రవికుమార్, గంగారాం తదితరులు పాల్గొన్నారు.

బెంచీల వితరణ

మల్లాపూర్: గుండంపల్లి జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలకు గురువారం కోరుట్ల పట్టణానికి చెందిన బాలాజీ బుక్‌సెల్లర్, మిత్ర బృందం రూ.లక్ష విలువ గల 26 డెస్క్ బెంచీలను విరాళంగా అందించారు. బాలాజీ బుక్‌సెల్లర్ యజమాని స్వామి మాట్లాడుతూ.. ప్రైవేటు పాఠశాలలకు దీటుగా విద్యనందిస్తున్న ప్రభుత్వ పాఠశాలల్లోనే తల్లిదండ్రులు తమ పిల్లలను చదివించాలన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు చంద్రప్రకాశ్, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ స్నేహిత, ఉపాధ్యాయులు అంజయ్య, మధు, ఫహిమా, గీత, సంతోష్‌కుమార్, ప్రాథమిక పాఠశాల హెచ్ఎం శ్రీనివాస్‌రెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

రక్తదాన శిబిరం



జగిత్యాలఅగ్రికల్చర్: జగిత్యాల రూరల్ మండలం పొలాస వ్యవసాయ కళాశాలలో రెడ్‌క్రాస్ సంస్థ ఆధ్వర్యంలో గురువారం రక్తదాన శిబిరం నిర్వహించారు. వ్యవసాయ విద్యార్థులతోపాటు బోధన, బోధనేతర సిబ్బంది రక్తదానం చేశారు. రక్తదానం చేసిన వారికి సర్టిఫికెట్లు అందజేశారు. ఇన్‌చార్జి అసోసియేట్ డీన్ డాక్టర్ సైదానాయక్, ఎన్ఎస్ఎస్ ఆఫీసర్ డాక్టర్ టి.ఎల్లాగౌడ్, రెడ్‌క్రాస్ సంస్థ జిల్లా కార్యదర్శి మంచాల కృష్ణ పాల్గొన్నారు.

కార్యదర్శి కుటుంబానికి అండగా ఉంటాం

జగిత్యాలరూరల్: విధి నిర్వహణలో మరణించిన పంచాయతీ కార్యదర్శి తిరుపతి కుటుంబానికి అండగా ఉంటామని అదనపు కలెక్టర్ గౌతమ్‌రెడ్డి అన్నారు. లక్ష్మీపూర్ గ్రామానికి చెందిన తిరుపతి గొల్లపల్లి మండలం బీబీరాజ్‌పల్లి గ్రామ కార్యదర్శిగా పని చేస్తూ ఇటీవల అనారోగ్యంతో మృతిచెందగా.. జిల్లా పంచాయతీ కార్యదర్శుల సంఘం ఆధ్వర్యంలో గురువారం తిరుపతి కుటుంబ సభ్యులను పరామర్శించి ఆర్థిక సాయం అందజేశారు. జిల్లా పంచాయతీ అధికారి మదన్‌మోహన్, ఎంపీడీవో రమాదేవి, ఎంపీవోలు సురేశ్‌రెడ్డి, రవిబాబు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.



విద్యార్థుల క్షేత్ర పర్యటన

మేడిపల్లి: తొంబర్రావుపేట ప్రాథమిక పాఠశాల విద్యార్థులను గ్రామంలోని వరి పొలానికి తీసుకెళ్లారు. క్షేత్ర పర్యటనలో భాగంగా ఉపాధ్యాయులు విద్యార్థులకు వరి నారు ఎలా తయారవుతుంది, నాటు వేయడం ఎలాగో స్థానిక రైతుల సహాయంతో ప్రత్యక్షంగా చూపించారు. విద్యార్థులు నాట్లు వేశారు. రైతు మీసాల శేఖర్ విద్యార్థులకు వివరించారు.